క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



వెంకన్నకు అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నకు రూ.3 లక్షల విరాళం



సూపరింటెండెంట్ విక్రమ్‌కు చెక్కు అందిస్తున్న దాత కూర్మారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని అల్లిపురానికి చెందిన ఎం.కూర్మారావు రూ.లక్ష 116 విరాళమిచ్చారు. దీంతోపాటు చందనం సమర్పణకు రూ.లక్ష, వచ్చే నెల 8న జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా ముత్యాల తలంబ్రాలు కొనుగోలు నిమిత్తం రూ.లక్ష విరాళంగా అందించారు. సంబంధిత చెక్కును సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో సూపరింటెండెంట్ విక్రమ్‌కు అప్పగించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంను అధికారులు అందించారు.

ఘనంగా సింహవల్లీ తాయారు తిరువీధి



అమ్మవారి తిరువీధిలో అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారుకు శుక్రవారం విశేషంగా తిరువీధి జరిపారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో వేంజేపచేశారు. సాయంత్రం ఆలయ బేడా మండపంలో తిరువీధి వైభవంగా నిర్వహించారు. విశేష హారతులందించారు.

ద్రోణంరాజునగర్‌లో వెలగని వీధిదీపాలు



విద్యుత్ స్తంభం నంబర్

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు ద్రోణంరాజునగర్‌లో చీకట్లు అలముకున్నాయి. కాలనీలో రెండు వీధుల్లోని వీధి దీపాలు మరమ్మతులకు గురవడంతో ఈ ప్రాంతం అంతా అంధకారం నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 18 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.80 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.కోట్లు వెచ్చించి టిడ్కో గృహాలు నిర్మించారు. ప్రస్తుతం ఇందులో నివసిస్తున్న ప్రజలు వసతుల సమస్యతో సతమతమవుతున్నారు. పారిశుధ్య నిర్వహణ సరిగాలేదు. వీధి దీపాల్లేక రాత్రుళ్లు రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా.. పట్టించుకోవట్లేదని వాపోతున్నారు.

సమస్యల నిలయాలు.. టిడ్కో గృహాలు

- ఏడాదిన్నరగా వీధి దీపాల కోసం నిరీక్షణ
- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- నీటి సరఫరా ఆగితే.. తాగునీటికి కటకట
- పెరుగుతున్న ఆకతాయిల ఆగడాలు



గొర్లివానిపాలెం టిడ్కో గృహ సముదాయం

వీధుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు

పరవాడ: గొర్లివానిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 512 టిడ్కో గృహాలను నిర్మించారు. 2023 డిసెంబర్లో వీటిని ప్రారంభించి, లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించారు. కాలనీలో ప్రస్తుతం 80 శాతం మంది సొంతిళ్లలో నివాసం ఉంటున్నారు. మరో 20 శాతం లబ్ధిదారులు గృహప్రవేశం చేయాల్సి ఉంది. ఖాళీగా ఉన్న ఆ ఇళ్లను ఇతరులకు అద్దెకిచ్చి, లబ్ధి పొందుతున్నారు. గత ప్రభుత్వంలోనే లబ్ధిదారులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. కాలనీలో వీధి దీపాలు, డస్ట్‌బిన్లు తదితర సదుపాయాలకు సన్నాహాలు చేస్తున్న సమయంలో ఎన్నికలు నోటిఫికేషన్ వచ్చింది. దీంతో వీధి దీపాల ఏర్పాటు పెండింగ్‌లో పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. కాలనీలో కనీస వసతుల గురించి పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది.



సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న కాలనీ వాసులు(ఫైల్)

రాత్రుళ్లు.. భయం భయం

ఏడాదిన్నర కాలం నుంచి కాలనీలో వీధి దీపాలు లేకపోవడంతో కాలనీవాసులు అంధకారంలో అలమటిస్తున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని పలు మార్లు విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరిగినా.. కనీసం పట్టించుకోలేదని వాపోతున్నారు. కాలనీ చుట్టూ దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలతో రాత్రి సమయంలో విష జంతువులు ఇళ్లలోకి ప్రవేశించి భయభ్రాంతులను గురిచేస్తున్నాయి. కూలి పనులకు వెళ్లి రాత్రివేళ చీకట్లో ఇళ్లకు చేరేందుకు బితుకు బితుకుమంటూ రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయని కారణంగా నివాసితులు చెత్తను రోడ్లపై వేస్తున్నారు. దీని కోసం వస్తున్న వీధి కుక్కలు, ఇతర జంతువులతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి.



టిడ్కో వీధుల్లో లైట్లు లేని విద్యుత్ స్తంభాలు

సమస్యలు బోలెడు

- సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కూడా ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతుండడంతో వాటి నుంచి ఎగిరిపడుతున్న చెత్త దిగువనున్న టిడ్కో కాలనీలోకి వచ్చి చేరుతోంది. దీంతో వీధులన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు.
- కాలనీ వీధుల్లోకి చెత్త బండి రాకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి.
- రేషన్ సరకుల వాహనం కాలనీకి రావట్లేదు. దీంతో ప్రతి నెలా రేషన్ సరకుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.
- కాలనీలో నీటి సరఫరాకు ఏదైనా అంతరాయం కలిగితే తాగునీటి ఇబ్బందులు తప్పనిసరి. కనీసం కాలనీలో చేతి పంపులు కూడా లేకపోవడంతో దూర ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడుతున్నారు.
- ఇటీవల కాలంలో కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఆకతాయిలు వీధుల్లో ఇష్టానుసారంగా మద్యం సేవించి, ఇళ్ల తలుపులు కొడుతూ, ఖాళీ ఇళ్లలో జూదం, తాగుడుకు పాల్పడుతున్నారు.
- రాత్రుళ్లు కాలనీలో వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లో ఇళ్లకు చేరాలంటే ఆకతాయిల కారణంగా మహిళలు భయపడుతున్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



కాలనీలో ఏడాదిన్నర నుంచి వీధి దీపాల్లేక కటిక చీకటిలో కాలం వెళ్లదీస్తున్నాం. వీధుల్లో విష పురుగులు/జీవుల సంచారం అధికంగా ఉంది. రాత్రుళ్లు ఇళ్లు దాటి బయటకు రావాలంటే భయపడుతున్నాం. సమస్యను అధికారులకు నివేదించినా ఫలితం లేదు. వీధి దీపాల ఏర్పాటుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– తుంపాల అన్నపూర్ణ, గృహిణి

చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలి



కాలనీలో చెత్త పేరుకుపోయి వీధులు అధ్వానంగా మారుతున్నాయి. చెత్త సేకరణ వాహనం రావట్లేదు. ఫలితంగా ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. రేషన్ సరకుల కోసం ప్రతి నెలా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర సమయంలో ఉపయోగపడేలా మూడు చేతి పంపులు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– మన్యాల బంగారమ్మ, గృహిణి

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



టిడ్కో కాలనీలో సమస్యల పరిష్కారానికి అధికారులకు చాలా సార్లు వినతులిచ్చాం. ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కాలనీలో వీధి దీపాలు, చేతి పంపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. రేషన్ వాహనం కాలనీకి వచ్చేలా చూడాలి. చెత్త సేకరణ వాహనం రావాలి. కాలనీలో సీసీ కెమెరాలను వీలైనంత వేగంగా ఏర్పాటు చేయాలి.

– పి.మాణిక్యం, ఐద్వా అనకాపల్లి జిల్లా మహిళ అధ్యక్షురాలు

మూలస్వయంభూవరంలో అధికారుల పర్యటన



మూలస్వయంభూవరం గ్రామంలో అధికారుల బృందం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకున్న కలపాక శివారు మూలస్వయంభూవరంలో కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), రెవెన్యూ, మండల అభివృద్ధి అధికారుల బృందం శుక్రవారం పర్యటించింది. ఈ నెల 23న 'కాలుష్య పడగ' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జిల్లా యంత్రాంగం దిగివచ్చింది. బృందంలోని అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీపీసీ విడుదల చేస్తున్న కాలుష్యంతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు, తక్షణమే తమ గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించాలని ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎన్టీపీసీ కూలింగ్ టవర్ల నుంచి విడుదలవుతున్న ఉప్పునీటి తుంపర్ల కారణంగా గ్రామంలో విద్యుత్ వైర్లు, స్తంభాలు తుప్పు పట్టి విద్యుత్ సరఫరాకు తరచూ తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయని, తుప్పు పట్టిన విద్యుత్ వైర్లను తొలగించి, కొత్త వైర్లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ సమీపంలోని కాలువ ద్వారా సంస్థ విడుదల చేస్తున్న ఉప్పునీటి ప్రవాహంతో గ్రామంలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమై, తాగునీరు దొరక్క దూర ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోందని వాపోయారు. గ్రామంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల సమస్యలపై నివేదికను రూపొందించి, జిల్లా కలెక్టర్‌కు అందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట రెవెన్యూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఇతర అధికారులు ఉన్నారు.

నేడు నూకాలమ్మ పండగ

గ్రామాల్లో ముస్తాబైన ఆలయాలు

పెందుర్తి: కొత్త అమావాస్య సందర్భంగా గ్రామాల్లో పండగ శోభ సంతరించుకుంది. పెందుర్తి ఆరాధ్య దేవత నూకాలమ్మతల్లి పండగను శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. పెందుర్తి ప్రధాన రహదారి అంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నూకాలమ్మకు పూజలు చేయనున్న నేపథ్యంలో ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు.



చింతలగ్రహారంలో అమ్మవారి బోనాలతో ఊరేగింపు



పెందుర్తిలో నూకాలమ్మతల్లి



సబ్బవరంలో కొలువైన నూకాలమ్మ

ఉత్సవాల సందర్భంగా చింతలగ్రహారంలో శుక్రవారం అమ్మవారికి సమర్పించేందుకు మహిళలు భారీగా బోనాల ఊరేగింపు చేశారు.

సబ్బవరం: కొత్త అమావాస్య పండగ పురస్కరించుకుని మండలంలోని నూకాలమ్మ ఆలయాలు ముస్తాబయ్యాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు శనివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని నూకాలమ్మ ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. గుల్లేపల్లిలోని నూకాలమ్మ జాతరను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



పెందుర్తిలోని నూకాలమ్మతల్లి ఆలయం



అమ్మవారి ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ



గుల్లేపల్లిలోని నూకాలమ్మ ఆలయంలో అమ్మవారి మాలధారణ భక్తులు

డైలీ మార్కెట్, వారపు సంత ఆశీళ్లకు వేలం

సబ్బవరం పంచాయతీకి రూ.8.29 లక్షల ఆదాయం

సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయతీలో ఉన్న డైలీ మార్కెట్, వారపు సంతల ఆశీలు వసూళ్లకు వేలం పాటను శుక్రవారం నిర్వహించారు. స్థానిక సచివాలయంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గం సమక్షంలో ఈ వేలం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ డైలీ మార్కెట్ ఆశీలు వేలం పాట రూ.5.23 లక్షలకు సింగంపల్లి రమేష్‌కు ఖరారు చేసినట్లు తెలిపారు. గతేడాది కంటే రూ.1.85 లక్షలు అధికంగా పంచాయతీకి ఆదాయం పెరిగిందన్నారు. వారం సంత వేలం పాటను రూ.3.06 లక్షలకు దొడ్డి ముత్యాలనాయుడు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఇది కూడా గతేడాది కంటే రూ.96 వేలు అధికానికి వెళ్లిందన్నారు. ఈ వేలం పాటలో 36 మంది పోటీపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సంత ఆశీళ్లకు వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి



పెందుర్తి విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం నిరుపేదల జీవితాలతో ఆడుకుంటోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు బి.రమణి విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కోసం సెకీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిరసనగా స్థానిక ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చిన తెలుగుదేశం పార్టీ, మంత్రి లోకేష్.. అధికారంలోకి వచ్చాక మాటతప్పారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు పెంచడంతో పాటు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపడానికి సిగ్గు లేదా? అని ప్రశ్నించారు. ప్రజలను నమ్మించి ఓట్లేయించుకుని వారిని దగా చేయడం టీడీపీకి అలవాటుగా మారిందన్నారు. దళితులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకం పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గోపాలపట్నం జోన్ కమిటీ సభ్యులు శంకర్రావు, కె.అప్పలనాయుడు, ఎస్.రాజు, ఈశ్వరరావు, ఎం.రాజు, అన్నపూర్ణ, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

రేపు అభయ వేంకటేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు

పరవాడ: మండలంలోని ఈ.బోనంగి ఫార్మాసిటీ కాలనీ సమీపంలో ఉన్న కొండపై కొలువుదీరిన శ్రీ భూసమేత శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 30న ఉదయం 8 గంటల నుంచి విశేష పూజా కార్యక్రమాలు జరపనున్నట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బుగిడి రామగోవిందరావు కోరారు.

మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీలోని నూకాలమ్మ పండగ పురస్కరించుకుని మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. వనం చంద్రరావు మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పాల సొసైటీ అధ్యక్షుడు సబ్బవరపు సత్యనారాయణ, వార్డు మెంబర్లు గొర్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు

'యువతకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది'



వైఎస్సార్‌సీపీ యువకులపై జరుగుతున్న దాడుల గురించి జక్కంపూడి రాజాకు వివరిస్తున్న పాలిశెట్టి సురేష్‌రాజ్ తదితరులు

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మండలంలోని పార్టీ నాయకులతోపాటు జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజమండ్రిలోని ఆయన నివాసంలో కలిసి పార్టీ యువకులపై కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దాడులను వివరించారు.దీనిపై స్పందించిన రాజా రానున్న రోజులలో పార్టీ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటుందని భరోసానిచ్చినట్లు పేర్కొన్నారు. సురేష్‌రాజ్‌తో పాటు గాలిభీమవరం సర్పంచ్ గొర్లి రాజేష్, మండల యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కర్రి శ్రీనివాస్, మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ సేనాపతి దుర్గ అప్పారావు తదితరులు ఉన్నారు.